# ఈ పొరపాటు చెయ్యకు?

రోజంతా నిర్విరామంగా వర్షం కురుస్తోంది.

కిటికిలోనించి తదేకంగా చూస్తూ, పది నిమిషాలు నాతో మాట్లాడకుండా ఏదో ఆలోచిస్తోన్నట్టు ఉండిపోయింది, సుజాత.

మరో నిముషం ఆమె ఆలోచన లేమిటోనని ఆలోచిస్తూ గడిపాను - కాని ఒక మానవుడి ఆలోచనల్ని మరొక మానవుడె లాగ అనుసరించగలడు? సామాన్య పరిస్థితుల్లోనే అది దుష్కరం... ముసురు పట్టిన సాయంకాలం, సుజాతలాటి మనిషి మనసులో ఏం అలోచనలున్నాయో ఎలాగ తెలుస్తుంది ?

సుజాత కళ్ళలో ఏవో కలలున్నాయి...

కలలంటే నాకు భయం ఉన్న సంతృప్తిని లేకుండాచేసి, లేని అసంతృప్తిని తెచ్చిపెట్టి జీవితంలో ఉన్న కొంచెం ఆనందాన్ని మాయం చేస్తాయి కలలు... ఆ కలల నిమిషాలు నిజాల గంటలకి సరితూగవు.

సుజాత కలలంటే మరీ భయం నాకు.

ఆమె హృదయంలో నామీద ప్రేమకి హద్దులు లేవని నాకు తెలుసును కాని, ఆమె చాలా ఆలోచించే మనిషి. ఆ

ఆలోచన లెంత వాస్తవంగా ప్రారంభించినా, ఏదో ఒకచోట అని మీదిమీదికి వెళ్ళి మా చక్కటి సంసారంలో తియ్యతియ్యటి తుఫానులనిసృష్టిస్తూ ఉంటాయి. అదంతా ముగిసి మళ్ళీ సంసారం స్థాయిలో పడ్డాక ఈ తుఫానులలోని సౌందర్యాన్ని నేను ఆస్వాదించగలనదేది నిజమే కాని, ఆ అత్యవసర పరిస్థితి ఉన్నంతసేపు మాత్రం నా ఆలోచనలు సౌందర్య ఆరాధనమీద ఉండవు.

అందుకూ, ఆమె కలలంటే భయం నాకు. ఆమె కళ్ళలో వింతగా ఉన్న ఆ కాంతిని చూసినా, అందుకే భయం నాకు.

హఠాత్తుగా ఆమె నా వైపు తిరిగి, "ఏమిటి ఆలోచిస్తున్నారు?" అంది.

"నీ ఆలోచనల గురించే!" అన్నాను.

చిరునవ్వుతో, "మరి, నాకేం ఆలోచన వొచ్చిందో తెలుసా?" అంది సుజాత.

"తెలీదు... చెప్పు" అన్నాను.

అనుకోకుండా ఆమెకి కావలసిన ప్రశ్న వెయ్యడం నా దురదృష్టకరమైన అలవాట్లలో ఒకటి. నా బుద్ధి చురుగ్గా పని చేసి, వెచ్చగా టీతాగుదామనో, పాటలు విందామనో, ప్రపోజల్ పెట్టి ప్రమాదకరమైన ఆలోచనలనించి ఆమెని ఇవతలికి తెచ్చి, క్షేమంగా, సంసార పథంలో సాగిపోయే నేర్పు నాకులేదు... అంటే, అయిపోయాక నా పొరపాటుని గుర్తించుకునే శక్తి, అలవాటూ ఉన్నా, తీరా సమయం వొచ్చేసరి కిలాగే, అజాగ్రత్తగా ఉండిపోతాను,

కిటికీ దగ్గరి కుర్చీవొదిలి నా పక్కకి వొచ్చి కూర్చుని, "ఈ వర్షంలో అలాగ వెళ్ళి తిరగాలని ఉంది" అంది సుజాత.

"ఈ వర్షంలోనా?"

"ఏం?... భయమా?"

నవ్వుతూ అంది సుజాత, నా కళ్ళల్లోకి చూస్తూ.

ఇలాటి ప్రశ్నలకి సమాధానాలంటూ ఉండవు. బయట వర్షం ఇంకా ఎక్కువైనట్టు కనిపించింది. నా కారు స్టార్ట్ అంటూ అయితే, ఈ వర్షంలో ఎంత దూరం వెళ్ళి ఆగిపోతుందో తెలీదు. నిర్మానుష్యమైన వీధుల్లోనో, నిర్జనంగా ఉండే ఊరి అవతలి రోడ్లలోనో ఏం నిజంగా జరుగుతుందోనని భయమే. కాని, ఎలాగ అంగీకరిస్తాను?

"పోనీండి... వొద్దులెండి"

అని నవ్వుతూ అంది సుజాత. ఆ మాటల్లో లాలన ఉంది. కాని, రెచ్చ గొట్టే లాలన అది. నాలోని భయాల్ని బయటికితీసి బుజ్జగించే నవ్వు అది.

టైము తొమ్మిది పైన అయింది.

వర్షం నిజంగానే ఎక్కువ అయింది.

వీధులన్నీ నీళ్ళలో మునిగి ఉంటాయి—

లేచి నిలబడి, "తయారవు... మళ్ళీ వర్షం తగ్గిపో తుంది!" అన్నాను.

సుజాత నవ్వి, తానూ లేచింది. జీవితం చల్లగానూ వేడిగానూ ఉండకూడదుట — వెచ్చగా వెచ్చగా ఉండాలిట. తన సూత్రం అది.

"ముందర తాజ్‌కి వెడదాం!" అంది.

"తాజ్ తలుపులు తియ్యరు..." అన్నాను. ఈ చీకటి రాత్రిలో, వర్షంలో దయ్యాలు మసిలేలాటి ఆచోటికి వెళ్ళాలని లేదు నాకు—

"బయటనించే చూద్దాం! అంది సుజాత.

'వగ పేటికి చల్లచిందినన్—' అని మనస్సులో అనుకుని, సుజాతతో, "అలాగే!" నని, గరాజ్‌లోనించి కారు తీసి పోర్టికోలో పెట్టేను. కారు స్టార్టయే సరికి పదినిమిషాలు పట్టింది. పెట్రోలు అంతగా ఉన్నట్టులేదు... ఇజంనులో నించి ఏమిటో వింతగాధ్వనులు...కాని, ఇవేవీ సుజాతకి చెప్పి లాభంలేదు...

లోపలికి వెళ్ళేసరికి టీ తెచ్చింది సుజాత. పదినిమిషాల కిందటి నిద్ర మొహం కాదు అమెది - కళ్ళలో ఏదో వెలుగు; ముఖంలో ఉత్సాహం.

నిశ్శబ్దంగా టీ తాగుతూ, నా కారు ఏంతదూరం వెడుతుంది? ఎక్కడ ఆగి పోతుంది? అని ఆలోచిస్తున్నాను. అంతరాంతరాలలో సుజాతమీద కోపంఏమీలేదునాకు...ఒకవిధంగా ఈ కోరిక నాకో కాంప్లిమెంట్. కాని, ఆమెని అప్రసన్నం చెయ్యకుండా ఈ ప్రయత్నంనించి విరమించగలిగితే నాకు విచారం కలగదు...

"ఆళగా ఆలోచిస్తున్నారా?" అంది సుజాత.

నవ్వి ఊరుకున్నాను...

మేము బయలుదేరబోతోంటే గేటు చప్పుడయింది... అటు చూసేసరికి గొడుగులో తల దాచుకుని వర్షంలో తడుస్తూ లోపలికి వొస్తూన్న సులోచన కనిపించింది.

రెండురకాల ఆలోచనలు పోటీపడుతూ వొచ్చాయి నాకు.

సులోచన అంటే నాకు అంతగా స్నేహభావంకాని గౌరవంకాని లేదు... మరి వెంకటేశ్ నాకు చాలా ఇష్టమైన మనిషి. సులోచన అతన్ని నిజంగా చాలా బాధలుపెట్టేసేది. అల్ప సంతోషి అయిన వెంకటేశ్ కి ప్రతిరోజూ ఏదో ఒక గొడవ ఆమెతోటి. ఆ పరాయిదేశంలో నాతోకాక ఎవరితో చెప్పుకుంటాడు?

ప్రశ్న వేస్తోన్నట్టు చూసింది సుజాత.

ప్రశ్న వేస్తోన్నట్టు చూశాను నేను.

సులోచన మా ఇంటికి వస్తే ఎంతవేగంగా వెళ్ళిపో తుందా అనిచూసే నేను ఆమె ఈ రోజు ఎంతసేపు ఉంటే అంత బాగుంటుందనుకున్నాను...పాలపొంగు అట్టే కాలం ఉండ నట్టే, మా సుజాత ఆలోచనల్లో పొంగు కూడా ఒక్కొక్క ప్పుడు త్వరగానే తగ్గుతూ ఉంటుంది...ఏమో!— రతుంతి పుణ్యాని పురాకృతాని!

సులోచనని లోపలికి తీసుకొచ్చి, టవల్ తెమ్మని నాకు ఆజ్ఞ ఇచ్చి సుజాతనేనక్కడ లేనట్టే కొద్ది నిమిషాలు ప్రవర్తిం చింది.

ఆ కొద్ది నిమిషాలలో స్పష్టమైన విషయం సులోచన చాలాసేపు ఉంటుందనీ, ఈ రాత్రికి నాకు మళ్ళీ వర్షంలో తడిసే యోగం లేదనీని. అయినా, కారు పోర్టికోలోనే ఉంచేను... అనవసరమైన ఆత్రత చూపితే సుజాతకి ఆలోచనలు రావొచ్చు...

ఇరవై నిమిషాలు లాంఛనాలతో గడిచిపోయాయి... సులోచన నివాసం మా పక్క వీధిలోనే అయినా ఆవిడ మాకంత తరుచుగా కనిపించదు... వెంకటేశ్ తరుచు రావడమే దీనికి కారణం ఏమో తెలీదు. సుజాత సులోచనకి టీ ఇచ్చి, కుశల ప్రశ్నలన్నీ వేసి, చివరకి, "పాపం! ఇలాటి రాత్రి బయలుదేరి వొచ్చారేం?" అంది.

నేను కిటికీ దగ్గర కూర్చున్నాను— వాళ్ళు ప్రత్యేకం గమనిస్తే తప్ప కనిపించను... అంచేత వాళ్ళు నన్ను చూడ లేదనుకుంటాను.

"ఏం చెయ్యనండీ!... ఇంకెక్కడికి వెళ్ళను?" అంది సులోచన.

మళ్ళీ సుజాత వేసిన ప్రశ్నకి సమాధానంలో భగవంతుడూ, సంసారం, మగవాళ్లూ, వాళ్ళలో మూర్తీభవించిన దుష్టత్వం... అన్నీ దొర్లాయి.

"పెళ్ళి అయేముందు ఎలాగ ఉంటారు మగవాళ్ళు! దేవుళ్లలాగ... కాని, పెళ్ళి అయేక...

కొంతసేపు భర్తలమీద జెనరల్ గానూ, తరువాత క్రమంగా వెంకటేశ్ మీద ప్రత్యేకంగానూ సులోచన ఉపన్యా

సించింది. ఇదంతా వింటోంటే వాళ్ళిద్దరికీ మధ్య ఈ రోజేదో పెద్ద గొడవే జరిగిందని త్వరలోనే తెలిసింది. నాకు అక్కడికి వెళ్ళి కొంతసేపు వెంకటేశ్‌తో గడపాలనిపించింది.

లేచి. అటునించే గార్డెన్‌లోకి వెళ్ళి పక్కనించి నా గది లోకి వొచ్చాను. తడిసిపోయాను. తుడుచుకుంటూంటే సుజాత వొచ్చి, "ఎక్కడికి?" అంది.

"ఎక్కడికీ లేదు..." అన్నాను. అనవసరంగా నిజం చెప్పి లాభంలేదు.

సుజాత పొడిబట్టలు తీసి ఇచ్చి, ఈ వర్షంలో ఎక్కడికీ పోకండి !- మీ ఆరోగ్యం అసలే మంచిదికాదు... రొంప చేస్తుంది!" అంది.

ఆ మాటల్లో ఆప్యాయత తప్ప మరేమీ లేదు. కాని, కొద్ది నిమిషాల క్రితం ఈ వర్షంలోనే నన్ను బయలుదేర దీసిన సుజాతకి ఈ క్షణంలో నాకు దగ్గరగా నిలబడ్డ సుజాతకీ తేడా ఏమీలేదు.

షర్ట్‌బటన్స్ అన్నీ పెట్టి దూరంగా వెళ్ళబోతూన్న సుజాతని వొదలాలని అనిపించలేదు. దగ్గరగా తీసుకుని, "సులోచన... వెళ్ళిపోయిందా?" అన్నాను, వ్యర్థమైపోతోన్న వర్షపు రాత్రిని చూస్తూ.

"లేదు... ఆమెను గురించి మాట్లాడకండి..."

కొన్ని నిమిషాలు మేము దేన్నీ గురించీ మాట్లాడ లేదు... బయట ఇంకా ఉధృతం తగ్గని వర్షపురొద... ఖాళీ

లేని మా మధ్య వెయ్యి చెప్పనక్కరలేని మాటలు. ఆ కొన్ని నిమిషాలూ క్షణం లాగ గడిచిపోయాయి.

ఒక్కసారి నన్ను విడిపించుకుని, "మీ రిలాగే...నమ్మ కూడనివాళ్లు!" అంటూ, డ్రెస్సింగ్ టేబిల్ ముందు కూర్చుంది

నిమిషం తరవాత లేచి వెడుతూ, "సులోచన ఉపన్యాసాలన్నీ విన్నారుగా!" అంది సుజాత.

"విన్నాను- నన్ను చూశావా?" అన్నాను.

"ఇద్దరం చూశాము... అందుకే ఆవిడ ఉపన్యాసాలు ... మీకోసం!- ఇంక ఆవిడ అసలు సంగతికి వొస్తుంది. అదేదో తెలిశాక ఆవిణ్ని డ్రాప్ చేసి రండి—అప్పటిదాకా, బుద్ధిగా కూర్చోండి!... కిటికీదగ్గర మట్టుకు కాదు!" అని చెప్పి, నా సమాధానం వినకుండానే సుజాత క్రిందికి వెళ్ళిపోయింది.

నవ్వుకున్నాను.

వానలేని సాయంకాలాలలో ఆ కిటికీ దగ్గర నిలుచుని, మ గార్డెన్‌కి అవతల ఉన్న ఇంట్లోని అమ్మాయిని నేను కొన్నిసార్లు చూసి ఉండడం నిజమే— సుజాత అదంతా ఎలాగ గమనించిందో తెలీదు...కానీ, ఈ సాయంత్రం సుజాత నన్ను వార్న్ చెయ్యడం!... సుజాత తత్వమే అది!

పదిన్నరదాకా పుస్తకం చదువుతూనూ, రేడియో వింటూనూ గడిపాను- అప్పటికి వర్షం తగ్గింది.

అప్పటికి సుజాత వచ్చి, నా పక్కన కూర్చు... "చదువు బాగా సాగుతోందా?" అంది.

"ఆవిడ వెళ్ళిందా?" అన్నాను.

"లేదు- మీరు డ్రాప్ చేసి రండి" అంది.

సంతోషంగా లేచాను. వాన వెలి యడంకన్నా ఆనందంగా ఉంది.

"నువ్వూరా!" అన్నాను సుజాతని.

"నేను భోజనంసంగతి చూస్తాను... అయినా మీకేం ప్రమాదం లేదు" అంది. అక్కడ వెంకటేశ్ ఉంటే, కొంచెం సేపు మాట్లాడాలనే ఆలోచన వొచ్చింది.

"అక్కడెవరూ లేరులెండి- వాళ్ళ నౌకరుతప్ప;"

"ఏం ?— వెంకటేశ్ —"

"అందతా ఓ పెద్ద కథ...డ్రాప్ చేసి వొస్తారా, లేక ఆవిణ్ని ఈ రాత్రికి మన ఇంటికి ఆహ్వానించేదా?" అంది సుజాత.

త్వరగా వెళ్ళి మళ్ళీ కారు స్టార్ట్ చేశాను. సులోచనని క్షేమంగా దింపి తిరిగి వొచ్చేసరికి పదినిముషాలు కూడా పట్ట లేదు.

"మీ కారుకిస్పీడ్ రికార్డులా ఉందే!" అంది డైనింగ్ రూమ్‌లో నా కోసం ఎదురుచూస్తూన్న సుజాత.

కొంచెం గర్వపడ్డాను.

ఆకలిగా ఉంది

ఇద్దరికీని.

సగంభోజనం అయాక, "సులోచన మాట అడగనే లేదేం?" అంది సుజాత.

"ఆమెమాట ఎత్తకు" అన్నాను.

"పాపం!... అయినా, మీ మగ వాళ్ళు అందరూ అంతే!" అంది సుజాత.

కొంచెం ఆశ్చర్యంగా చూశాను.

కాని, ఏమీ అనలేదు. క్లిష్టపరిస్థితుల్లో వొచ్చి నన్ను కొంచెం రక్షించినా, సులోచనకి ఆ రాత్రి అక్కడ స్థానం లేదు...నాటకంలో తనపాత్ర నిర్వహణ అయిపోగానే నటుడు నిష్క్రమించాలి. సులోచనా అంతే.

భోజనం ముగించి మీదికి వెళ్లాను. కిటికీ తలుపులు తీశాను...రాత్రి చాలా ఆలస్యం అయినా, చాలా ఇళ్ళలో దీపాలు వెలుగుతూనే ఉన్నాయి. తడి రాత్రులకీ దీపాలకీ ఉన్న సంబంధాలని గురించి ఆలోచిస్తూ పడుకుని సిగరెట్ కాలుస్తోంటే సుజాత వచ్చింది.

ఆమె నా కెప్పుడూ బాగానే ఉంటుంది...కాని యిప్పుడు మరీ బాగుంది.

నాకు అందకుండా కాళ్ళ దగ్గర కూర్చుని "మీ వెంకటేశ్-ఏమిచేసేడో తెలుసునా?" అంది.

"తెలీదు-కాని, అలాటివన్నీ పగలు చెప్పుకునే కథలు", అన్నాను.

"కాదు...పాపం, సులోచనని ఎందుకలా ఏడిపిస్తాడు ...ఇవేళ ఏం జరిగిందో తెలుసా?"

నాకు తెలీదు. కాని, అడగాలనిలేదు.

సుజాత నా చేతిలో పుస్తకం అటుపడేసి, "పాపం!... ఏదో తెలియక సులోచన ఏదో అంటే—"

"ఏమంది?"

"ఏమైతేనేం లేండి? ఆడది...ఏదో అంటుంది..."

"ఇంతకి, ఏమంది?"

అనిష్టంగానే సుజాత జరిగిన సంగతి...సులోచన కథ నంప్రకారం... జరిగినది చెప్పింది.

ఆమె, వెంకటేశ్ సంసారం మొదలు పెట్టిన ఈ ఎదిమిది నెలల్లోనూ, అతను ఒక్కరోజుకూడా టైముకి ఇంటికి వచ్చే వాడు కాదుట "టైముకంటే ?... ఏం ప్రశ్నలండీ మీవి ? వాళ్ల ఆఫీసు అయిదుకి అయిపోతుందా? దయాల్బాగ్‌నించి ఈదోగ్గాకి స్కూటర్ మీద ఆరునిమిషాలేనా?...అధా? ఒకనాడావిడ స్వంతంగా చూసిందిలెండి...ఏం ఆడవాళ్ళు స్కూటర్ నడపలేరా?- దానికేంలెండి... అతను మామూలుగా ఇంటికి చేరేసరికి ఏడు, ఎనుమిదీట- ఒక్కొక్కప్పుడు పదీ పద కొండూట-

నవ్వేను. సుజాత పట్టించుకోలేదు.

"పాపం! అతనంటే ఆవిడకి ప్రాణం కదా! నిమిషం ఒక గంటలాగ గడుస్తుందట..."

"మరి-ఇవేళ?"

"సెలవురోజుకదా? అతను ఇంటి పట్టున ఉండకూడదూ?- ఆవిడకి అసలేకాలం గడపక రోజుకో సినిమాకి పాపం ఒంటరిగానే పోతుంది కదా ఈ రోజైనా ఆ వెంకటేష్ ఆమెతో గడపకూడదూ?"

"నీ లాజిక్..."

"నా లాజిక్ వొదిలి న్యాయానికి రండి!... అతనెక్కడికో వెళ్ళడానికి పదిగంటలకే ప్రయాణం అవుతోంటే పాపం! తన ప్రేమకొద్దీ తాను పాధ పడి... ఏ అమ్మాయి కోసం?' అని అడిగిందిట...అంటే ఒక అరగంటపాటు ఆ విషయంలోనే ఆవిడ ఏదో అందే అనుకొండి... అతను మాత్రం ఉదయం పదిన్నరకి వెళ్ళి ఇప్పటిదాకా రాలేదుట!"

"పాపం..."

"నిజమే! అసహాయురాలు——"

నేను బాధపడుతోన్నది వెంకటేష్ కోసం అనబోయి, ఊరుకున్నాను. చల్లటిగాలి వేస్తోంది...ఈమెతో మాటల యుద్ధానికి దిగేసమయం కాదు.

నన్నేం చెయ్యమంటావు ? ఎక్కడ వెతకడం ?" అన్నాను మంచిగా,

"ఈ రాత్రా ?...మీకు మతిపోతోంది."

నేనేం అన్లేదు. సుజాత మాటలో కొంత నిజం ఉంది మరి.

"నేను చెప్పింది, మీ మగవాళ్లు చేసే అన్యాయాలను గురించి-పాపం! ఆమె ఏదో అందే అనుకోండి సరీగాసర్ది చెప్పాలి గాని, ఇంత భీకరమైన రాత్రికి కూడా ఇంటికి రాకుండా ఎక్కడో ఉండిపోతాడా?"

"అది పొరపాటే...కాని సులోచన అలాగ వేధిస్తే ఏంచేస్తాడు!"

"అతను తప్ప ఆమె కింకెవ్వరూ లేరుకనక, అలా అంది...బాధకొద్దీని. ఏదో హాస్యంగా తీసుకోవాలిగాని...ఆ వాకౌట్ ఏమిటి?"

అ తర్కానికి ఎలా సమాధానం చెప్పను?

ఏమిటో ఆలోచిస్తూ కొంచెంసేపు కూర్చుని, దీపాలు తీసేసింది సుజాత. నాకూ్కడా లొంగకుండా అటు వెళ్ళిన నా చేతుల్ని నాకు వొప్పగిస్తూ. ఎంత ఆలోచించినా, మగవాళ్లు చేసే అన్యాయాలకి హద్దులు కనిపించడం లేదు...ఏం చెయ్యాలో?" అంది.

ఇలాటి ప్రశ్నకి జవాబుగా మరికొంచెం అన్యాయం చెయ్యడమే న్యాయం-ఆ మాట సుజాతకీ తెలుసును.

ఉదయం ఆరు కాకుండానే సుజాత నన్ను లేపి, "త్వరగా లేవండి..." అంది.

ఉదయం నేను షేవ్ చేసుకునేదాకా నా ముఖం చూడననే వ్రతానికి విరుద్ధంగా సుజాత నన్ను లేపుతోందంటే ఏదో జరిగి ఉంటుందని వెంటనే లేచి, "ఏమిటి?" అన్నాను,

"వెంకటేశ్ వచ్చాడు..."

"ఎంతసేపయింది?"

"పది నిమిషాలు,..."

"ఏమంటాడు?"

"మీరే అడగండి..."

కిందికివెళ్ళి టీ తీసుకుంటూ ఇద్దరం మాట్లాడుకున్నాం. అంటే, వెంకటేశ్ మాట్లాడుతూంటే నేను విన్నాను.

అంతావిని నేను చాలా ఆశ్చర్యపడ్డాను.

వెంకటేశ్‌కి భార్య సులోచన అంటే భయం అనీ, ఆమెగీసిన గీటు దాటడనీ. అతని జీవితంలో ఆనందాని కట్టే చోటు లేదనీ నాకు మామూలుగా ఉద్దేశం...అవే నిజమైన కారణాలనుకుంటాను-అతను వెళ్ళి ఓ వన్నెలాడిని పరిచయం చేసుకున్నాడు.

వివరాలనిబట్టి ఆమె అతన్ని లోబరుచుకుందనిపించినా, ఆ మాట అంగీకరించేలాగ లేడు వెంకటేశ్.

వివరాలన్నె ఎందుగ్గాని, నాలుగైదు నెలలనించి అతను కొంత ఆనందాన్ని పొందుతూ వొచ్చాడు. ఓవర్ టైమ్ అనీ, టూర్ అనీ, పేర్లుపెట్టి సెలవు తీసుకునీ, ఆ దొంగిలించినగంటలని ఆమెతో గడుపుతూ——

నిన్న అంతా తెలిసిపోయింది సులోచనకి, అతను బాధపడిపోతున్నాడు.

"ఆమెకి అన్యాయం చేసేను బ్రదర్!—ఇదంతా ఆమెకెలా తెలిసిందో! అయినా, ఎలా ఇన్నాళ్ళూ భరించిందో!... తలుచుకుంటేనే సిగ్గుగా ఉంది!—ఆమెకి నా ముఖం చూపెట్టలేక నిన్ననంతా అక్కడా అక్కడా తిరిగేను..."

"ఎక్కడా?" అన్నాను.

"అక్కడ కాదులే...మధురలో ఫ్రెండ్ ఉంటే అక్కడికి వెళ్ళేను..."

మళ్ళీ తన జీవితం సాఫీగా సాగేందుకు...ఎలాగైనా దారి చూపెట్టమంటాడు...

నేను అంతా తెలిశాక బాధపడ్డాను. నిశ్శబ్దంగా అందరం కూర్చున్నాం.

సులోచన అంటే నాకంత అభిమానం లేకపోవడానికి కారణాలు జ్ఞాపకం వొచ్చాయి.

వెంకటేశ్ పెళ్ళిచేసుకుని వొచ్చినరోజు జరిగినది ఇప్పటికీ నాకు జ్ఞాపకం ఉంది.

రైలు దిగగానే నేనూ, సుజాతా, మరో నలుగురైదుగురం వెళ్ళి స్వాగతం ఇచ్చాము. వెంకటేశ్ మెరుస్తోన్న కళ్ళతో గర్వంగా, ఆమెని మా అందరికీ వేరు వేరుగా పరిచయం చేసి ఆమెకీ మమ్మల్నందరినీ పరిచయంచేశాడు.

మేమందరమూ కలిసి లంచ్ ఏర్పాటు చేశాము. వారిద్దరినీ ఆహ్వానించేము.

వెంకటేశ్ చాలా కృతజ్ఞత చెప్తూంటే సులోచన అతన్ని పక్కకి పిలిచి ఏమిటో చెప్పింది. రెండునిమిషాలు అతను బ్రతిమిలాడుతోన్నట్టు ఏదో అనడమూ ఆమె బుర్ర అడ్డంగా ఆడించడమూ గమనించాను.

చివరికి ముఖం వేలవేసుకుని వొచ్చి, "సారీ బ్రదర్!... ఇవేళ ఆవిడకేదో వ్రతంట...పూజచేసుకుని వొండుకుని తప్ప తినదట!...అన్నాడు.

ఉన్న ఆడవాళ్లు ఏమి పూజోనని అడిగి చూశాడు-కాని ఆమె ఏమీ చెప్పలేదు-చివరికి ఎందరేమన్నా సులోచన అంగీకరించకపోతే మేమందరం వాళ్లు లేకుండానే లంచ్ ముగించాము. అప్పుడే సులోచన మీద కొంత దురభిప్రాయం కలిగినా, ఆమె 'వ్రతం'లో ఏమన్నా నిజం ఉందేమోనన్న అనుమానం చిన్నది లేకపోలేదు. కాని వాళ్లు తరవాత ఒక హోటల్‌కి వెళ్ళి భోజనం చేసిన సంగతి విశ్వసనీయంగా తెలిశాక అసలు విషయం బోధపడింది.

ఆ తరవాత చిన్న చిన్న విషయాలు లిలాటివే జరిగినా, నేను పెద్ద బాధపడ లేదు. కాని వెంకటేశ్‌ని మా ఇంటికి రాకుండా ఆమె కట్టడి చెయ్యడం నాకు కోపం తెప్పించింది ...అక్కడికి వొచ్చిన సంగతి ఆమెకి తెలియకుండా అతను జాగ్రత్తపడవలసిన అవసరం కలిగించింది సులోచన.

వీటన్నిటిని గురించి ఆలోచించి, ఉన్న సంగతి అతనికి చెప్పేద్దామని అనుకున్నాను... కాని, సుజాత కళ్లతోనే నన్ను వారించడంతో అప్పటికి ఊరుకున్నాను. ఆమెకి సులోచనమీద

ఏ భావాలు ఉన్నా, అభిమానం ఉన్నట్టే ఆమెతో ప్రవర్తించేది. చాలాకాలం దాకా దీని కారణం నాకు బోధపడలేదు. క్రమంగా, ఇది స్త్రీలకి మధ్య ఉండే సహజమైన సింపతీ అని బోధపడి, సరి పెట్టుకున్నాను.

మాకంతా చెప్పేక వెంకటేశ్ హృదయం తేలిక పడ్డట్టు ఉంది, అతను నిద్రపోయాడు. నేను అంతా అతనికి చెప్పాలనే ఆలోచన బలపడుతూంటే టెలిఫోన్ వొచ్చింది - హడావుడిగా బయలుదేరి ఫిరోజాబాద్ వెళ్లాల్సి వొచ్చింది.

"మీరు వెళ్ళిరండి... ఈ విషయం నాకు వొదిలేయండి" అంది సుజాత.

నామీద ఉన్న బాధ్యత ఏదో నేను నిర్వహించని బాధతో, "ఏం చేస్తావు?" అని అడిగాను సుజాతని.

"సులోచనకి మంచి జరిగేలాగ!" అంది సుజాత.

"వెంకటేశ్ మాట?" అన్నాను.

సుజాత నవ్వి ఊరుకుంది.

నేను వెళ్లిపోయాను. ప్రయాణంలో ఈ విషయం గురించి అంతగా ఆలోచించలేదు... ఆమె ఏంచేస్తుందో నాకు తెలుసుగా!... ఇలాగా దేవుడిగా వాళ్ళిద్దరి జీవితాలతో ఆడుకోవడం సుజాతకి చాలా సంతృప్తిగా ఉంటుంది అనుకున్నాను. పాపం, వెంకటేశ్!

ఆ రాత్రి ఆలస్యంగా వొచ్చాను - భోజనం అయిందనిపించి ఎంతో బడలికగా మంచంమీద వాలేసరికి అనుకోకుండానే నిద్ర పట్టేసింది.

సుజాత లేపితే ఆశ్చర్యంగా లేచేను.

గంభీరంగా ఉంది ఆమె.

"ఉదయం జరిగిం దేమిటో అడగ లేదేం?" అంది.

"అడగవలసిన అవసరం లేదు కనక!" అన్నాను.

"నిద్రగా ఉందా?" అంది, క్షణం ఆగి.

"అవును... దేవుడి ఆటఆడి నువ్వూ అలిసిపోయిఉంటావు-నిద్రపో!" అన్నాను. నాకు మళ్ళీ నిద్ర పట్టేసింది.

నాలుగైదు రోజులు ఆ ప్రస్తావన మా మధ్య రాలేదు. నేనూ నా ఆఫీసు పనిలో పూర్తిగా నిమగ్నమైపోయాను.

ఆ రోజు శనివారం. నాలుగౌతోంటే వెంకటేశ్ వొచ్చాడు.

వాడి ముఖం చూడగానే జాలికలిగే లాగ ఉంది. ఆశ్చర్యం ఏముంది? సుజాత చెప్పాల్సినవన్నీ చెప్పాక వాడి జీవితం పూర్తిగా నరకం అయిపోయి ఉంటుంది.

నాలుగు నిముషాలు మాట్లాడకుండా అలాగే కూర్చున్నాడు వెంకటేశ్.

ఏమనాలో నాకూ తెలియలేదు.

సిగరెట్ ఆఫర్ చేశాను.

ముందు వొద్దని, మళ్ళీ అడిగి తీసుకుని, "రాత్రి జీ. టీ. కే ప్రయాణం" అన్నాడు.

ఆశ్చర్యపడి, "ఎక్కడికి?" అన్నాను.

"మా వూరు... అంటే అత్తవారి ఊరు" అన్నాడు.

"ఎన్నాళ్లు ?"

"శాశ్వతంగాను... ఈ ఆగ్రాలో ఇవే నా చివరి గడియలు," అన్నాడు తొందరగా సిగరెట్ దమ్ములాగుతూ.

నా కా క్షణంలో సులోచనమీద కన్న సుజాతమీద కోపం ఎక్కువగా వొచ్చింది.

"సారీ..." అన్నాను.

అతను తల వొంచుకున్నాడు.

"సుజాతని క్షమించు—" అన్నాను. ఒక్కసారి అవతల పారవేసి వెంకటేశ్ ఒక్కసారి లేచి నిలబడ్డాడు.

"సుజాతనా ?— క్షమించడమా ? నీకు మతి పోయిందా ?" అన్నాడు.

తెల్లబోయి చూశాను.

ఉద్రేకంగా మాట్లాడాడు వెంకటేశ్.

"సుజాత నూరుసార్లు నోరు మూసుకొమ్మని నాకు చెప్పింది జగన్! సులోచన చేత నాకు క్షమాపణ చెప్పించింది! —జరిగిన నిజం సులోచనకి చెప్పనని సుజాతకి వాగ్దానం చేశాను... రెండు రోజులు తిరగకుండా ఒక్క నిమిషంలో అన్నీ మరిచిపోయి— అంతా చెప్పేశాను. సుజాత చెప్పినట్టే అయింది— క్లోజ్! రెండురోజుల తరవాత కరిగిపోయి నిజం చేప్తే నా జీవితం ఇంక నరకమేనని ఆమె అన్నంతా అయింది!"

ఆశ్చర్యపడి, ఆలోచనల్లో ఉండి పోయాను,

"గుడ్ బై బ్రదర్!— అక్కడేదేనా ఉద్యోగం దొరికితే ఉత్తరం రాస్తాను!"

వెనక్కి తిరిగి చూడకుండా అతను వెళ్ళిపోయాడు.

టైము చూడకుండా నేను వెంటనే ఇంటికి వెళ్ళాను, సుజాతని చాలా అడగాలనిపించింది. కాని, మరీ గంభీరంగా ఉన్న ఆమె ముఖంచూసి, "ఏం అలాగ ఉన్నావు" అని మాత్రం అడిగాను.

"ఫోనులో సులోచన..." అని, ఆగిపోయింది సుజాత. కన్నీళ్ళు పెట్టేశక్తి ఉంటే ఆ క్షణంలో అవి బయటికి వొచ్చి ఉండేవి.

ఆమెని దగ్గరగా తీసుకున్నాను.

ఇంకా దగ్గరగా వొచ్చి, పెద్ద నిటూర్పు విడిచింది. నా కళ్ళలోకి చూస్తూ, "చూడండి! ఒక్క వాగ్దానం చెయ్యండి" అంది సుజాత.

అలాగేనని సూచించేను.

"ఆ వెంకటేశ్ లాగా చెయ్యకండి! ఎప్పుడూ!"

చాతనయినంత మృదువుగా, "కాని... వెంకటేశ్ అంత పెద్ద తప్పు ఏమీ చెయ్యలేదు సుజాతా!... అ మనిషితో తప్పుగా తిరగడం తప్ప!" అన్నాను.

మళ్ళీ నిట్టూర్చింది సుజాత.

నానించి విడిపించుకుని, ఒక్క అడుగు అవతలికి వేసి,

"అదికాదండీ, అతని పొరపాటు!..." అంది.

"మరి?"

"అంత సుళువుగా దొరికిపోవడం!"

ఎర్రటి ఆమె కళ్ల వెనకాల చిరునవ్వు ఉన్నట్టు అనిపించింది నాకు. కాని, ఆకళ్లలోకి పరీక్షగా చూడలేకపోయాను.

సిగరెట్ తీసుకున్నాను.

వొణుకుతూన్న చేతులతో దాన్ని వెలిగించే ప్రయత్నంలో కళ్ళు ఇటు తిప్పుకున్నాను.

సుజాత త్వరగా క్రిందికి వెళ్ళిపోయింది.

O